సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

శుక్రవారం । 22 । నవంబర్ । 2024



సందు రస్తాను అమ్మేశారు

బద్వేలులోని రాధాకృష్ణనగర్ సమీపంలో ఉన్న సందు రస్తాను అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు అమ్మేశాడు. -8లో



తెగులు..రైతన్నలకు గుబులు

ఇటీవల కురిసిన జడివానలు, తుపాను కారణంగా ఎనుపు పంటకు అక్కడక్కడా ఆకుమచ్చ,వేరుతెగులు సోకింది. -8లో

గరిష్టం/కనిష్టం
30.4/20.6

వాతావరణం

జిల్లాలో గురువారం 20.6 – 30.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

24న క్రీడాపోటీలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడా మైదానంలో ఈనెల 24వ తేదీన ఇషా ఫౌండేషన్ గ్రామోత్సవ వేడుకల్లో భాగంగా పురుషుల వాలీబాల్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ కె. జగన్నాథరెడ్డి తెలిపారు. పోటీల్లో విజేతలకు నగదు ప్రోత్సాహకరాలు అందించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు డీఎస్‌ఏ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పదోతరగతి పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఫీజు గడువును ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ వరకు పెంచిందని జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఇప్పటికే పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని, అదే విధంగా రెండు పర్యాయాలు పరీక్ష రుసుం చెల్లించేందుకు తేదీలను కూడా మార్చిందన్నారు. అపరాధ రుసుము లేకుండా ఈనెల 26వ తేదీలోగా పాఠశాల లాగిన్ www.bse.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా చెల్లించి ఇతర పత్రాలను పొందుపరచాలని డీఈఓ సూచించారు.

ఉపాధి నిధులు వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

వీరబల్లి : ఉపాధి హామీ పథకం నిధులు వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఫార్మర్స్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ రాజశేఖర్ రాజు తెలిపారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధి హామీ నిధులు దాదాపు పది వేల కోట్లు ఎన్డీఏ ప్రభుత్వం ఖర్చు పెట్టే పరిస్థితిలో ఉందన్నారు. అందులో నుంచి పదిశాతం వ్యవసాయ రంగానికి కేటాయిస్తే గ్రామాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. రైతులు విత్తనం నాటినప్పటి నుంచి కోతదశ వరకు వ్యవసాయ కూలీలకు పని దొరుకుతుందని తెలిపారు. ఈ విషయంపై ప్రభుత్వ అధికారులు ఆలోచించి రైతులకు ఉపయోగపడే పనులకు ఉపాధి నిధులు ఖర్చుచేస్తే వారికి మేలు జరుగుతుందని తెలిపారు.

24న సాహిత్యం సదస్సు

కడప కల్చరల్ : యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెల సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 138వ సదస్సును ఈ నెల 24వ తేది ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. ఈ సదస్సులో 'మధురాంతకం రాజారాం జీవితం–సాహిత్యం' అనే అంశంపై కడప ప్రభుత్వ పురుషుల కళాశాల తెలుగుశాఖాధ్యక్షులు డాక్టర్ కె.ఎస్.సుందరేశ్వరరావు ప్రసంగిస్తారన్నారు.

వైవీయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



పరీక్షలను తనిఖీ చేస్తున్న వీసీ కృష్ణారెడ్డి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయ ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ సెమిస్టర్ల పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయ ఆవరణలోని ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న పరీక్షలను వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్.వి.కృష్ణారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాల్ టికెట్లను వారు పరిశీలించారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఆచార్య కాత్యాయని మాట్లాడుతూ పరీక్షలు డిసెంబరు 4వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. పరీక్షల నిర్వహణలో సూపరింటెండెంట్లు డా.లక్ష్మీ ప్రసాద్, డా.మునికుమారి తదితరులు పాల్గొన్నారు.

పనివేళల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంకం శివారెడ్డి, పి.మధుసూదన, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడిమాల మురళి డిమాండ్ చేశారు. గురువారం జిల్లాలోని పలు మండలాల్లోని పాఠశాలలను సందర్శించి ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత పాఠశాలల పనివేళలను సాయంత్రం 5 గంటల వరకు పొడిగించాలన్న నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. పాఠశాలల పనివేళలను 5 గంటలకు ముగిస్తే పిల్లలు ఇంటికి చేరే సమయానికి చీకటి పడుతుందని వివరించారు. విద్యార్థుల భద్రత అంశంపై ప్రభుత్వం ఆలోచించాలని కోరారు.

బడిగంటలు పెరిగాయి

- పాఠశాల పనివేళలను పెంచిన ప్రభుత్వం
- పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో 36 హైస్కూళ్లు ఎంపిక





విద్యార్థినులకు బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు

కడప ఎడ్యుకేషన్ : ఏ ప్రభుత్వ కార్యాలయమైనా అధికారికంగా రోజుకు 7 గంటలు పని చేస్తుంది. బ్యాంకులు సైతం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే సేవలందిస్తాయి. అయితే ప్రభుత్వ పాఠశాలలు మాత్రం రోజుకు 8 గంటలు పనిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అయ్యవార్లు, విద్యార్థులు పాఠశాలల్లోనే ఉండే విధంగా ప్రణాళికలు రూపొందించింది. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో మండలానికో పాఠశాలను ఎంపిక చేసి వాటిలో కొత్త పనివేళలను అమలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి మండలానికి ఒక పాఠశాలను ఎంపిక చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. జిల్లావ్యాప్తంగా 36 ఉన్నత పాఠశాలల్లో ఈ పనివేళలు అమలులోకి రానున్నాయి.

పనివేళల పెంపు నష్టమా? లాభమా?

పాఠశాలల పనివేళలను సాయంత్రం పూట మరో గంట పెంచడం వల్ల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు లాభం కంటే నష్టమే ఎక్కువ కనిపిస్తోంది. పిల్లలను 8 గంటలపాటు పాఠశాలలో కూర్చోబెట్టడం ఆక్షేపనీయమని మేధావులు అభిప్రాయ పడుతున్నారు. సాధారణంగా ఉన్నత పాఠశాలలకు గ్రామీణ ప్రాంతాల నుంచి పిల్లలు వస్తుంటారు. అన్ని గ్రామాలకు సరైన రవాణా సౌకర్యాలు లేవు. దీంతో పిల్లలు 5 గంటల వరకు పాఠశాలలోనే గడిపితే ఇంటికి వెళ్లడానికి ఆలస్యం అవుతుందంటున్నారు. ఒక్కో పీరియడ్ 45 నిమిషాల వంతున 8 పీరియడ్లను పెట్టడం వల్ల విద్యార్థులు మరింత అలసిపోయే ప్రమాదం కూడా ఉంది. ప్రార్థన సమయాన్ని 15 నిమిషాల నుంచి 25 నిమిషాలకు పెంచడం కూడా అభ్యంతరకరమే.25 నిమిషాల పాటు పిల్లలను ఆరుబయట నిలబెట్టడం శ్రేయస్కరం కాదని మేధావులు చెబుతున్నారు.

ఉపాధ్యాయులకు రెట్టింపు భారం..

ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకే పాఠశాల చేరుకోవాలంటే దూరాన్ని బట్టి ఇంటివద్ద 7 లేదా 8 గంటలకే బయలుదేరాలి. సాయంత్రం 5 వరకు బడిలోనే ఉంటే ఇంటికి చేరుకొనేసరికి రాత్రి 7 అవుతుంది. అంటే అయ్యవార్లు ప్రభుత్వ విధుల కోసమే రోజులో 10 నుంచి 12 గంటలు కేటాయించాల్సి వస్తుంది. ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులకు ఇది కష్టకాలమే అని చెప్పవచ్చు. కొత్త ప్రభుత్వ తీరును ఇటీవల ఓ ఉపాధ్యాయుడు విశ్లేషిస్తూ తమ పరిస్థితి పెన్నం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు ఉందని వ్యాఖ్యానించాడు. యాప్‌ల భారం తగ్గించకపోగా పాఠశాలల పనివేళలను పెంచడం ఉపాధ్యాయులకు మరింత ఇబ్బందికరంగా మారింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఐదు నెలలు గడుస్తున్నా ఇంతవరకు వీరికి రావాల్సిన బకాయిల ఊసే ఎత్తలేదు.అలాగే జూలై నెలలో మాత్రమే ఒకటో తేదీన వేతనాలు అందాయి.ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో ఏ ఒక్క ఉపాధ్యాయుడికీ ఒకటో తేదీన జీతాలు అందలేదు.కొత్త ప్రభుత్వం మధ్యంతర భృతి ప్రకటిస్తుందని ఆశించారు. అయితే ప్రస్తుత బడ్జెట్లో ఆ ఛాయలే కనిపించలేదు. కొత్త ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ నిరాశే మిగిలిందని, ప్రస్తుతం పాఠశాలల పనివేళల పెంపును చూస్తుంటే అయ్యవార్ల సహనానికి సర్కారు పరీక్ష పెట్టినట్లు ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కొత్త టైమ్ టేబుల్ ఇదే	
ఫస్ట్ బెల్	9 గంటలకు
సెకండ్ బెల్	9.05
స్కూల్ అసెంబ్లీ	9.05 నుంచి 9.25
మొదటి పీరియడ్	9.25 నుంచి 10.15
2వ పీరియడ్	10.15 నుంచి 11.00
బ్రేక్	11.00 నుంచి 11.15
3వ పీరియడ్	11.15 నుంచి 12.00
4వ పీరియడ్	12.00 నుంచి 12.45
లంచ్ బ్రేక్	12.45 నుంచి 1.45
5వ పీరియడ్	1.45 నుంచి 2.30
6వ పీరియడ్	2.30 నుంచి 3.15
బ్రేక్	3.15 నుంచి 3.30
7వ పీరియడ్	3.30 నుంచి 4.15
8వ పీరియడ్	4.15 నుంచి 5.00

అశాస్త్రీయ నిర్ణయం



ఉన్నత పాఠశాలల పని వేళల పొడిగింపు అశాస్త్రీయం. పిల్లలు సంసిద్ధంగా ఉండరు. చాలా మంది గ్రామీణ ప్రాంతాల నుంచి పాఠశాలలకు వస్తుంటారు. ముఖ్యంగా అమ్మాయిలు ఇంటికి చేరుకోవాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మహిళా ఉపాధ్యాయులు సైతం సాయంత్రం 5 గంటల తర్వాత ఇంటికి వెళ్లడం శ్రమతో కూడుకున్నదే. ప్రస్తుతం ఉన్న వేళలు కొనసాగించాలి.

- లెక్కల జమాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, ప్రగతిశీల ఉపాధ్యాయ సంఘం

పనివేళలు పెంచడం సరికాదు..



పాఠశాల పనివేళలు పెంచాలన్న ఆలోచన ప్రభుత్వానికి మంచిది కాదు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ఇక్కడ బడి గంటలు పెంచడం సరికాదు. పల్లెల నుంచి ఉదయం 9 గంటలకు వచ్చిన విద్యార్థులు సాయంత్రం 4 గంటలకు బడి వదిలితే ఇంటికి 5 గంటలకు చేరుకుంటారు. అలా కాకుండా 5 గంటల వరకు ఉంటే ఇబ్బందులు పడతారు. పిల్లలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుంది

- నరేడ్డి, సంగమేశ్వరరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్టీయూ

విద్యార్థులు ఒత్తిడికి గురవుతారు



ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద పాఠశాల వేళల్లో మార్పులు చేయాన్న ఆలోచన సరికాదు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుదీర్ఘ సమయం విద్యార్థులు పాఠశాలల్లో విద్యార్థులు ఉండటం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతారు. విద్యార్థుల మానసిక స్థితిని అంచనా వేసి సైకాలజిస్టులు, విద్యావేత్తలు, మేధావులు పాఠశాలల పనివేళలు నిర్ధారించారు.వాటిని కొనసాగించాలి.

- పాలెం మహేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి,యూటీఎఫ్.

రెండు రోజుల్లో ప్రొసీడింగ్స్ ఇస్తాం



జిల్లావ్యాప్తంగా 36 మండలాల్లో 36 పాఠశాలలను ఎంపిక చేశాం. వీటిల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు తరగతులు నిర్వహించేలా రెండు రోజుల్లో ప్రొసీడింగ్స్ ఇస్తాం.

- మీనాక్షి, జిల్లా విద్యాశాఖాధికారి

ప్రాధాన్యతా రంగాలను పటిష్టం చేయాలి

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రాధాన్యతా రంగాల పటిష్టతతోనే జిల్లా అన్ని విధాల అభివృద్ధి పథంలో పయనిస్తుందని, ఆ దిశగా ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు, ఏపీ ఎంఐపీ,పశుసంవర్ధక శాఖల వారీగా సమీక్షించారు. అలాగే పాడి పరిశ్రమ, పౌల్ట్రీ, గొర్రెలు, మేకల పెంపకందార్లను ఆర్థికంగా ముందుకు నడిపించేందుకు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. పశువులు, గొర్రెలు, మేకల పెంపకందార్లు.. ప్రభుత్వం కల్పిస్తున్న పశుబీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. సంచార పశువైద్య శాలల ద్వారా గ్రామస్థాయిలో సేవలను విస్తృతం చేయాలన్నారు. ఎక్కడా కూడా పశుగ్రాసం కొరత లేకుండా చూడాలన్నారు. పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా.. ముందస్తు వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు. అనంతరం మార్క్ ఫెడ్ , జిల్లా పౌరసరఫరాల శాఖల గురించి తెలియజేస్తూ జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సజావుగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పట్టుపరిశ్రమను పునరుజ్జీవం కల్పించేలా.. ప్రణాళికలు రూపొందించి కార్యాచరణ చేపట్టాలన్నారు. జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా బ్యాంకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రాథమిక రంగాలను పటిష్ట పరచడం కోసం క్షేత్ర స్థాయిలో అధికారులు సాంకేతికంగా, శాస్త్రీయంగా నైపుణ్యతతో క్రియాశీలంగా బాధ్యతతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలోసంబంధిత శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

పరాఖ్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా డిసెంబర్ 4వ తేదీన 3,6,9 తరగతుల విద్యార్థులకు నిర్వహించనున్న పర్ఫార్మెన్స్ అసెస్మెంట్ రివ్యూ అండ్ అనాలిసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ (పరాఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ-2024) పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి పేర్కొన్నారు. గురువారం కడప సీఎస్ఐ స్కూల్‌లో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌కు రాష్ట్రీయ సర్వేక్షణ -2024 పరీక్ష నిర్వహణపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పరిశీలించడంతో పాటు ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ప్రభుత్వం ఈ పరీక్ష నిర్వహిస్తోందన్నారు. ఇందు కోసం జిల్లాలో 139 పాఠశాలలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇందులో ఒక్కో పాఠశాల నుంచి తరగతికి 30 మంది చొప్పున మూడు తరగతులకు సంబంధించిన విద్యార్థులను ఎంపిక చేశారన్నారు. వీరికి డిసెంబర్ 4న జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలో పరీక్ష జరుగుతుందన్నారు. డీసీఈబీ సెక్రటరీ విజయభాస్కర్‌రెడ్డి, ఆర్‌పీలు వెంకటేశ్వరరెడ్డి, ఖాసింఖాన్ తదితరులు పాల్గొన్నారు.

హై..హై..వాసు!

- కడప నగరంలో పెత్తనం చెలాయిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు
- హోదా లేకపోయినా ప్రొటోకాల్ పాటిస్తున్న పోలీసులు
- జనరల్ ఫండ్ రోడ్డు నిర్మాణానికి వాసుతో భూమి పూజ
- మేయర్, కార్పొరేటర్‌కు కనీస సమాచారం ఇవ్వని వైనం



కడపలోని ప్రకాష్‌నగర్ సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న టీడీపీ నేత శ్రీనివాసులరెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప : కడప నగరంలో పోలీసు సైరన్ మోతలు అధికమయ్యాయి. అనధికార పెత్తనం ఎక్కువైంది. కార్పొరేషన్ యంత్రాంగం జీ..హుజూర్ అంటూ తలాడిస్తూ వెళుతున్నారు. జనరల్ ఫండ్ సైతం మేయర్, సంబంధిత కార్పొరేటర్‌కు తెలియకుండా మంజూరవుతోంది. పాలక మండలితో నిమిత్తం లేకుండా ఏకంగా భూమి పూజలు సైతం చేయిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి చుట్టూ తిరుగుతోంది. కలెక్టర్ వద్దకు వెళ్లడం విస్మరిస్తారేమో కానీ, ప్రభుత్వ అధికారులు ఠంఛన్‌గా వాసు వద్దకు వెళ్లి కన్పిస్తున్న వైనమిది.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డికి ఎలాంటి అధికారిక హోదా లేదు. ఆయన వాహనం నగరంలో బయలుదేరిందంటే ముందు వైపు పోలీసు జీపు వచ్చి చేరుతోంది. సైరన్ వేసుకుంటూ వెళ్తుంటే ఆ వెనుకే టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి వాహనం తర్వాత అనుచరుల వాహనశ్రేణి వెళుతోంది. తుదకు టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి వెళ్లినా పోలీసు జీపు సైరన్‌తో వెళ్తూ లేని ప్రొటోకాల్‌ను కల్పిస్తున్నారు. మొన్నటి వరకూ నిబంధనలను అనుసరించి వ్యవహరించే పోలీసు యంత్రాంగం జిల్లా కేంద్రంలో విచ్చలవిడిగా ప్రవర్తిస్తోంది. అధికారం ఉంది.. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తాం.. మాకు అడ్డు చెప్పేదెవ్వరు అన్నట్లుగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి శైలి కూడా ఉండిపోయిందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

జీ.. హుజూర్ అంటున్న యంత్రాంగం..

ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులంతా భాగస్వామ్యులు. ఆ వాస్తవాన్ని విస్మరించి అధికారులు ప్రవర్తిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు మాత్రమే ప్రభుత్వంలో భాగస్వామ్యులన్నట్లుగా పలువురు వ్యవహరిస్తున్నారు. ఇలాంటి ధోరణి ప్రధానంగా కార్పొరేషన్ యంత్రాంగంలో అధికంగా కనిపిస్తోంది. పాలక మండలితో నిమిత్తం లేకుండా జనరల్ ఫండ్ వెచ్చింపులో సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బుధవారం కడపలోని 20వ డివిజన్‌లో విశ్వేశ్వరయ్య సర్కిల్ నుంచి ప్రకాష్‌నగర్ వెళ్లే రహదారి ఏర్పాటుకు రూ.15లక్షలతో సీసీ రోడ్డు నిర్మించేందుకు భూమి పూజ చేశారు. ఈకార్యక్రమం టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి చేతుల మీదుగా చేపట్టారు. అసిస్టెంట్ కమిషనర్ రాకేష్, డీఈ వేణుగోపాల్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది దగ్గర ఉండి భూమి పూజ చేయించడం విశేషం. కాగా నగర పాలక మండలి నిధులతో చేపడుతున్న ఈ రోడ్డు నిర్మాణం గురించి స్థానిక కార్పొరేటర్, మేయర్ సురేష్‌బాబుకు కనీస సమాచారం లేదు. అదే విషయాన్ని కార్పొరేటర్ కమిషనర్ మనోజ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. శ్రీనివాసులరెడ్డితో భూమి పూజ ఏ హోదాతో చేయించారు? ప్రజాప్రతినిధులంతా భాగస్వామ్యులు అన్న వాస్తవాన్ని ఎందుకు విస్మరించారు? కార్పొరేటర్‌గా నా హక్కులు హరించడం సమంజసమా? ఇలాంటి ప్రశ్నలకు అధికారుల వద్ద ఎలాంటి జవాబు లేదు. కాగా, శ్రీనివాసులరెడ్డితో భూమి పూజ చేయించడం అసిస్టెంట్ కమిషనర్ రాకేష్ స్వామిభక్తి ప్రదర్శించడమేనని పలువురు పేర్కొంటున్నారు. ఇలాంటి సంప్రదాయం ఇకపై కొనసాగకుండా చూడాల్సిన ఆవశ్యకత ఉందన్న వాస్తవాన్ని యంత్రాంగం గ్రహించాల్సి ఉంది.

ఎదురుచూపులు

అన్ని శాఖల్లోకి ప్రధానమైనది వైద్య ఆరోగ్య శాఖ. ఈ శాఖలో గత ప్రభుత్వ పాలనలో ఎప్పటికప్పుడు నియామకాలు జరిగాయి. ఫలితంగా అర్హులైన వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభించాయి.దీంతో ప్రజా వైద్యానికి ఏనాడు ఆటంకాలు ఎదురుకాలేదు. కూటమి ప్రభుత్వం నియామకాలను నిలుపుదల చేసింది. ఆ ప్రభావం అర్హులైన స్టాఫ్ నర్స్‌లపై పడింది. జోన్-4 పరిధిలో వందలాదిగా స్టాఫ్ నర్స్‌ల పోస్టుల ఖాళీలు ఉన్నాయి. అయితే ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నియామకాలు కోసం అర్హులు ఎదురుచూస్తున్నారు.



వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

- వైద్య శాఖలో నిలిచిన నియామకాలు
- నోటిఫికేషన్ ఊసే ఎత్తని పాలకులు
- స్టాఫ్ నర్స్‌లకు తప్పని నిరీక్షణ

కడప రూరల్ : కడప వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 (రాయలసీమ జిల్లాలు) పరిధిలో గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వైద్య ఆరోగ్య శాఖలో పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు జరిగాయి. దీంతో వందలాది మంది అర్హులైన నిరుద్యోగులు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌లుగా ఉద్యోగాలు పొందారు. ప్రస్తుత టీడీపీ పాలనలో అర్హులైన వారు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు.

గత ప్రభుత్వంలో 'ఆర్డీ'పరిధిలోనే 1,550పైగా నియామకాలు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వైద్య ఆరోగ్య శాఖ అత్యంత బలోపేతంగా మారింది.వెల్లువలా వివిధ కేడర్‌లకు సంబంధించిన నియామకాలు జరిగాయి. ప్రధానంగా స్టాఫ్ నర్స్ నియామకాలు పెద్ద ఎత్తున జరిగాయి. 2021-2022లో నాటి ప్రభుత్వం మొదటి విడతగా కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్స్ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పుడు రాయలసీమ జిల్లాల నుంచి అర్హులైన అభ్యర్థులు కడపలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయానికి దాదాపు 11, 500కు పైగా దరఖాస్తు చేశారు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన, ఏడాది పొడవునా ఐదు విడతలుగా నియామకాల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒక్కో కౌన్సెలింగ్‌కు 100-150 మందికి పైగా ఉద్యోగావకాశాలు లభించాయి. మొత్తం 800 మందికి పైగా అర్హులు స్టాఫ్ నర్స్‌లుగా ఉద్యోగాలు పొందారు. అనంతరం 2023 నవంబర్ నెలలో నాటి ప్రభుత్వం మరోమారు రెండోవిడతగా స్టాఫ్ నర్స్ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకు సంబంధించి అభ్యర్థుల నుంచి 10 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఆ దరఖాస్తుల ఆధారంగా నిబంధనలు, మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక జాబితాను తయారు చేశారు. విడతలవారీగా కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 5 విడతలుగా జరిగిన కౌన్సెలింగ్‌కు ఒక్కో విడతలో 100 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు దక్కాయి. రెండో విడతలో దాదాపు 750 మందికి పైగా నిరుద్యోగులు స్టాఫ్ నర్స్‌లుగా ఉద్యోగాలు పొందారు. మొత్తం మీద కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో రామలసీమ జిల్లాల నుంచి కేవలం స్టాఫ్ నర్స్‌ల నియామకాలు రెండు నోటిఫికేషన్లకు దాదాపు 1,550 మందికి పైగా ఉద్యోగాలు పొందారు. రెండో విడత నోటిఫిషన్‌కు సంబంధించిన కౌన్సెలింగ్‌కు దాదాపు 50 మంది హాజరు కాలేదు. వాస్తవానికి మెరిట్ జాబితాలో వరస క్రమంలో తరువాతి స్థానాల్లో ఉన్న వారితో 50 ఖాళీలను భర్తీ చేయాలి. అంతలోనే టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో వైద్య రంగానికి 'చంద్ర'గ్రహణం పట్టింది. మిగిలిన 50 పోస్టులను భర్తీ చేయడం సంగతి అటుంచితే ఏకంగా ఎలాంటి కొత్త నియామకాలు చేపట్టవద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆరోగ్య శాఖలో వెల్లువలా జరిగే ఉద్యోగ నియామకాలకు అడ్డుకట్ట పడినట్లయింది.

జోన్-4 పరిధిలో 600 'స్టాఫ్ నర్స్'ఖాళీలు

ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖ అధికారులు జోన్-4 పరిధిలోని రాయలసీమ ప్రాంత జిల్లాల పరిధిలో దాదాపు 600 స్టాఫ్ నర్స్ పోస్టులు భర్తీ చేయాలని అధికారులు గుర్తించారు. అయితే ఇంత వరకు టీడీపీ కూటమి ప్రభుత్వం అత్యవసర విభాగమైన వైద్య రంగంలో నియామకాల ఊసే ఎత్తలేదు. వాస్తవానికి కీలకమైన ఈ శాఖలో ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేయడమేగాక, ఉద్యోగ నియామకాలను చేపట్టాలి. అయితే ఇప్పటి వరకు ఆ ప్రస్తావనే ఎక్కడా వినిపించడం లేదు.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం




నేను ఇటీవలనే బాధ్యతలు స్వీకరించాను. స్టాఫ్ నర్స్ నియామకాలకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేస్తాం.

- డాక్టర్ రామగిడ్డయ్య, రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

ముగిసిన పెద్దదర్గా ఉరుసు

కడప కల్చరల్ : ప్రముఖ ఆధ్యాత్మిక, సూఫీ క్షేత్రమైన కడప అమీన్‌పీర్ (పెద్ద) దర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాలు గురువారం ముగిశాయి. బుధవారం రాత్రి ప్రారంభమైన దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ నగరోత్సవం తెల్లవారుజాము వరకు కొనసాగింది. అనంతరం దర్గాలో ప్రముఖ గాయకులతో ఖవ్వాలీ కచేరి నిర్వహించారు. గురువారం ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు బందారు ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సమస్యలను పీఠాధిపతి ప్రత్యేకంగా ఆలకించి పరిష్కారాలు సూచించారు. వారు తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లేందుకు అనుమతులు మంజూరు చేశారు. పెద్ద ఉరుసుఉత్సవాలు వారం రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, భక్తులకు ఆయన అభినందించారు. ఉత్సవాలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు.



ప్రార్థనల్లో పాల్గొన్న దండు వీరయ్య మాదిగ తదితరులు

పెద్దదర్గాలో ప్రముఖుల ప్రార్థనలు

కడప అమీన్‌పీర్ దర్గాకు నేడు కూడా భక్తులు, అతిథుల రాక కొనసాగింది. గురువారం కూడా భక్తులు విశేష సంఖ్యలో ప్రధాన గురువుల మజార్లను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ, సతీమణి నారాయణమ్మ, నాయకులు ఆంజనేయులు, సుబ్బయ్య, నాగభూషణంలతో కలిసి వచ్చి దర్గాలోప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా మత సామరస్యానికి మారుపేరుగా నిలువడం ఈ ప్రాంత గొప్పతనాన్ని తెలుపుతోందన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య


గజ్జల ఓబుల్‌రెడ్డి మృతదేహం

వల్లూరు (చింతకొమ్మదిన్నె): చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గజ్జల ఓబుల్‌రెడ్డి (54) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు చింతకొమ్మదిన్నె పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు... ఓబుల్ రెడ్డి గత పది సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నయం కాకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని ఈనెల 18వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో ఇంటి వద్దనే గడ్డి మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం వేలూరు సీఎంసీ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

విద్యార్థినిని గాయపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి


బ్రహ్మయ్యకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఓరుగంటి నాగేంద్రబాబు

కడప రూరల్: కమలాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినిని గాయపరిచిన పీఈటీపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు కోరారు. ఆ మేరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ వల్లూరు బ్రహ్మయ్యకు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 7వ తరగతి చదువుతున్న అను అనే విద్యార్థినిని పీఈటీగా పనిచేస్తున్న చంద్రకళావతి కొట్టడం వల్ల చేతికి తీవ్ర గాయమైందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్ వైఎఫ్ నగర నాయకులు సాయి, చరణ్, వినోద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత


వల్లూరు మండలంలో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

వల్లూరు: మండల పరిధిలోని చెరువు కిందిపల్లె గ్రామ సమీపంలో పెన్నా నది నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 5 ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు తహసీల్దార్ శ్రీవాణి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఆర్ఐ సందీప్ విలేజ్ రెవెన్యూ అధికారులతో కలిసి దాడులు నిర్వహించి పెన్నా నది నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను లోడు చేసుకుని కడప నగరానికి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు పట్టుబడిన ట్రాక్టర్లకు జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అట్లూరు: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు సిద్దవటం దగ్గర పెన్నానది నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టరును గురువారం తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేక పోవడంతో స్వాధీనం చేసుకున్నామన్నారు.

పసుపు పంటకు తెగులు..

రైతన్నలకు గుబులు



- పలు గ్రామాల్లో ఆకుమచ్చ, తాటాకు, దుంపకుళ్లు తెగులు
- సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ
- జిల్లా వ్యాప్తంగా 4170 ఎకరాల్లో పసుపు పంట సాగు

కడప అగ్రికల్చర్: జిల్లాలో ఈ ఏడాది రైతులు 4170 ఎకరాల్లో పసుపు పంటను సాగు చేశారు. అయితే ఇటీవల కురిసిన జడివానలతో పాటు తుపాను కారణంగా సాగు చేసిన పసుపు పంటకు అక్కడక్కడా ఆకుమచ్చ, తాటాకుమచ్చ, దుంప, వేరుతెగులు సోకింది. దీంతో పంట దెబ్బతిని కుంగిపోతోంది. పసుపు పంటలో ప్రస్తుతం కొమ్ము ఏర్పడి ఇప్పుడిప్పుడే బలపడే సమయం ఆసన్నమైంది. ఈ తరుణంలో ఈ తెగుళ్ల సోకితే పంట దెబ్బతిని దిగుబడి తగ్గే అవకాశం ఉన్నందున అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత తరుణంలో నివారణ చర్యలు చేపడితే తెగులు నివారణ నుంచి పసుపు పంటను రక్షించుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు.

దుంప, వేరుకుళ్లు తెగులు..

ఈ తెగులు నేల ద్వారా సంక్రమిస్తుంది. విత్తనశుద్ధి చేయని కొమ్ములను నాటడం, నీటి పారుదల సరిగా లేకపోవడం, బరువైన నెలల్లో సాగు చేస్తున్నప్పుడు బోదె మరియు సాళ్ల పద్ధతిని పాటించకపోవడం, సమగ్ర ఎరువుల యాజమాన్యాన్ని పాటించకపోవడం, ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసి మొక్కల చుట్టూ నీరు నిలబడి ఉండడం, పొటాష్ మరియు వేపపిండి ఎరువులను సక్రమంగా వాడకపోవడం వంటి కారణాల వలన ఈ తెగులు ఆశిస్తుంది. ఈ తెగులు అక్టోబర్-నవంబర్ మాసాల్లో తీవ్రమవుతుంది. ఈ తెగులు సోకిన పొలం గమనించినప్పుడు ముందుగా ముదురు ఆకులు అంచుల నుండి పసుపు రంగుకు మారి, వాడిపోయి గోధుమ రంగుకు మారి చివరగా ఎండిపోతాయి. తరువాత మొక్క పై భాగాన ఉన్న లేత ఆకులకు ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ తెగులు ఆశించిన దుంప వేర్లు నలుపు లేదా గోధుమ రంగుకి మారి, మొక్క ఎదుగుదల ఆగిపోతుంది. తల్లి కొమ్ములు, పిల్ల దుంపలు మెత్తబడి కుళ్లిపోతాయి. దుంపలు కుళ్లి చెడువాసన రావడమే కాకుండా నాణ్యత బాగా తగ్గుతుంది. పొలంలో మొక్కలు సుడులుగా ఎండిపోయి కనిపిస్తాయి.


తెగులు సోకిన పసుపు పంట

నివారణ ఇలా...

తేలికపాటి నేలలు, నీరు పోయే సౌకర్యం ఉండాలి. బరువు నేలల్లో బోదె, సాళ్ల పద్ధతిని పాటించాలి.. తెగులు ఆశించిన మొక్క చుట్టూ ఉన్న మిగిలిన మొక్కల మొదళ్ల తడిచేలాగా మెటలాక్సీల్ 2 గ్రాములు లీటర్ నీటికి, లేదా మెటాలాక్సీల్ + మాంకోజెబ్ 2 గ్రాములు లీటర్ నీటికి లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి ద్రావణంతో తడపాలి. వేసిన పొలంలోనే పసుపు వేయకుండా వరి, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న మొదలగు పంటలతో పంట మార్పిడి చేయాలి. దుంపలు విత్తిన తరువాత జీలుగ, జనుము, వెంపలి, వేప, కానుగ మొదలైన పచ్చి ఆకులు లేదా ఎండు వరిగడ్డి, చెరకు ఆకులను పొలంపై మొలకలు వచ్చేంత వరకు కప్పడం వలన తెగులు ఉధృతిని కొంతవరకు తగ్గించవచ్చు. తెగులు తట్టుకునే రకాలైన సుగుణ, సుదర్శనలను సాగుచేసుకోవాలి.

ఆకు మచ్చ తెగులు..

ఈ తెగులు మొదట ఆకులపై చిన్న చిన్న పసుపు రంగు చుక్కలు ఏర్పడతాయి. తరువాత చిన్న చిన్న గోధుమరంగు మచ్చలుగా మారతాయి. తెగులు ఎక్కువైతే ఆకు మాడి పోతుంది. నవంబరు, డిసెంబరు మాసాలలో ఈ తెగులు ఎక్కువగా సోకే అవకాశం ఉంటుంది. తెగులు సోకిన ఆకులను కత్తిరించి నాశనం చేయాలి. తాటాకు మచ్చ తెగులుకు సూచించిన మందులతో పాటు 1.0 మి.లీ ప్రోపికొనజోల్ లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

తాటాకు మచ్చ తెగులు..

ఈ తెగులు ఈదురు గాలులతో కూడిన వర్షాలు, గాలిలో తేమ శాతంతోపాటు ఉష్ణోగ్రత తక్కువగా ఉండడం వలన వ్యాపిస్తుంది. సెప్టెంబర్ నుంచి ఈ వ్యాధి కనపడుతుంది. అండాకారంలో పెద్ద పెద్ద మచ్చలు ఆకులపై అక్కడక్కడా కనపడతాయి. మచ్చలు ముదురు గోధుమ రంగులో ఉండి మచ్చ చుట్టూ పసుపు రంగు వలయం ఉంటుంది. ఆకు కాడపై మచ్చలు ఏర్పడి కిందకు ఆకు వాలుతుంది.

నివారణ ఇలా..

మచ్చలు ఉన్న ఎండిన ఆకులను తొలగించి కాల్చివేయాలి. లీటరు నీటికి 1.0 గ్రా కార్బండజిమ్ లేదా 2.5 గ్రా మాంకోజెబ్ 0.5 మి.లీ సబ్బు నీరు లేదా థయోఫానేట్ మిథైల్ 1.0 గ్రా లేదా కార్బండజిమ్ మరియు మాంకోజెబ్ లేదా ప్రోపికొనజోల్ 1.0 మి.లీ కలిపి ఉన్న మందులను 15 రోజుల వ్యవధిలో సెప్టెంబర్ నుంచి 3–4 సార్లు పిచికారీ చేయాలి

నివారణ చర్యలు ఇలా..



పసుపు పంటకు సోకిన తెగులు లక్షణాలను బట్టి తెగులు నివారణ మందులు వాడాలి. దీంతోపాటు తాటాకు మచ్చతెగులు, ఆకుమచ్చ తెగులు సోకిన ఆకులను కత్తిరించి నాశనం చేయాలి. అలాగే శాస్త్రవేత్తలతోపాటు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి తెగుళ్లను నివారించుకోవచ్చు. – **డాక్టర్ వీరయ్య, సీనియర్ శాస్త్రవేత్త, కేవీకే కో ఆర్డినేటర్**

పరిశ్రమల కాలుష్యంతో ఇబ్బందులు


ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు రూరల్: వైఎస్సార్ జిల్లా మైలవరం మండలం చిన్నకొమెర్ల, నవాబుపేట, దుగ్గనపల్లె గ్రామాల మధ్యలో నిర్మితమైన దాల్మియా సిమెంట్ కర్మాగారం వల్ల రైతులు, ప్రజలు పడుతున్న బాధలను ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి గురువారం శాసన మండలిలో ఏకరువు పెట్టారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాల నుంచి దాల్మియా కర్మాగారం వల్ల దుగ్గనపల్లె, నవాబుపేట గ్రామ రైతులు, ప్రజలు కాలుష్యం, వరదనీరు ప్రవాహం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దాల్మియా కర్మాగారాన్ని ఆనుకొని అలుగువంక ఉందని, దీంతో ప్రతి ఏడాది దాదాపు 33 వేల కూసెక్కుల వరద నీరు ప్రవహిస్తుండటంతో దుగ్గనపల్లె గ్రామంలోని 50 దళిత కుటుంబాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. అలాగే నవాబుపేట గ్రామంలోని పట్టా భూముల్లో కూడా వరద నీరు ప్రవహిస్తుండటంతో అక్కడి రైతులు దాదాపు 150 ఎకరాల్లో పంటలు సాగుచేయడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మెడికల్ కళాశాల ఏర్పాటుపై న్యాయం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప ఎడ్యుకేషన్: గత ప్రభుత్వం దాదాపు రూ. 250 కోట్లు ఖర్చు చేసి పులివెందులలో మెడికల్ కళాశాలను పూర్తి చేసిందని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి శాసనమండలిలో ప్రస్తావించారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి డాక్టర్స్ నియామకం, ల్యాబొలేటరీస్ పూర్తి చేయడం జరిగిందన్నారు. అయితే 50 సీట్లకు అనుమతి వస్తే తాము చేయలేమని ప్రస్తుత ప్రభుత్వం చేతులెత్తేసిందని ఆయన ధ్వజమెత్తారు. వచ్చే ఏడాదికైనా వంద సీట్లకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి పిల్లలకు న్యాయం చేయాలని కోరారు.

ఆడపిల్లల భద్రత గాలిలో దీపం

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల: రాష్ట్రంలో ఆడపిల్లల భద్రత గాలిలో దీపంలా తయారైందని, మహిళలు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. కాశినాయన మండలం చెన్నవరం - పాపిరెడ్డిపల్లె గ్రామాల మధ్య ఓ మహిళ దారుణ హత్య గురువారం ఉదయం ఈ ప్రాంతంలో కలకలం రేపింది. చాపాడు మండలం ఖాదర్‌పల్లెకు చెందిన వివాహిత కరీమున్‌గా గుర్తించారు. మహిళ ఆనవాళ్లు లేకుండా చేసేందుకు రాళ్లతో తలను ఛిద్రం చేశారు. ఈ సంఘటనపై ఎమ్మెల్సీ తీవ్రంగా స్పందించారు. గురువారం రాత్రి ఆయన మాట్లాడుతూ మహిళపై దారుణంగా దాడి చేసి హత్య చేయడం బాధాకరమన్నారు. ఆడబిడ్డలకు రక్షణ కల్పించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెచ్చిన దిశ యాప్‌ను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాల్సిన పోలీసు వ్యవస్థను ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు వాడుకుంటోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రోజుకు సగటున 49 మంది మహిళల మీద అఘాయిత్యాలు జరుగుతున్నాయని అసెంబ్లీలో హోంమంత్రి చెప్పడాన్ని బట్టి పరిస్థితులు ఎంత భయంకరంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. దిశ యాప్ ఉండి ఉంటే పాపిరెడ్డిపల్లెలో మహిళ ఏదో ఓ రకంగా రక్షింపబడి ఉండేదని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. త్వరగా నిందితున్ని పట్టుకుని చట్టపరమైన శిక్ష పడేలా చూడాలని ఆయన కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, చెన్ను రాజశేఖర్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాషా, బద్వేలు మాజీ మండలాధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు సాయి నారాయణరెడ్డి, సుబ్బారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న కడప న్యాయవాదులు

కడప అర్బన్: తమిళనాడు రాష్ట్రం హోసూరులో కోర్టు వద్ద న్యాయవాది పాశవికంగా దాడి చేయడం దారుణమని కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బొగ్గుల గుర్రప్ప నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కడపలోని జిల్లా కోర్టు ఎదురుగా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సందు రస్తాను అమ్మేశారు

- యథేచ్ఛగా నిర్మాణ పనులు
- అడ్డుకున్న మహిళలపై దురుసు ప్రవర్తన

టాస్క్‌ఫోర్స్: బద్వేలు పట్టణంలోని శివాలయానికి వెళ్లే దారిలో రాధాకృష్ణనగర్ సమీపంలో గల 855 సర్వే నంబరులో ఉన్న సందు రస్తాను అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు అమ్మేశాడు. కొనుగోలు చేసిన వ్యక్తి సదరు స్థలంలో నిర్మాణాలు చేపడుతుండగా స్థానిక మహిళలు అడ్డుకున్నారు. ఈ సమయంలో సదరు నాయకుడు మహిళలపై దురుసుగా ప్రవర్తించినట్లు మహిళలు ఆరోపిస్తున్నారు. అయితే కొద్దిసేపటి తర్వాత విషయం తెలుసుకున్న రెవెన్యూ, మున్సిపల్, పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి పనులను నిలుపుదల చేయించారు. మడకలవారిపల్లె గ్రామ పొలం సర్వే నంబర్ 855లో శివాలయానికి వెళ్లే రోడ్డు సుమారు 90 అడుగుల మేర ఉండేది. కాలక్రమేనా కొందరు పట్టాలు చేయించుకుని మరికొందరు ఆక్రమించుకుని ఇంటి నిర్మాణాలు చేపట్టారు. అయితే ఇదే రోడ్డులో రాధాకృష్ణనగర్‌కు సమీపంలో మూడు సెంట్ల జాగా కొన్నేళ్లుగా ఖాళీగా ఉంది. సదరు ఖాళీ జాగా స్థలం పక్కనే రిజిస్టర్ స్థలం ఉన్న అధికార పార్టీ నాయకుడు ఇటీవల ఓ వ్యక్తికి సదరు సందు రస్తా స్థలాన్ని రూ.25 లక్షలకు విక్రయించినట్లు తెలిసింది. కొనుగోలు చేసిన వ్యక్తి సదరు స్థలంలో ఇంటి నిర్మాణం చేపడుతుండగా స్థానిక మహిళలు అడ్డుకున్నారు. అయినా లెక్క చేయకుండా ఇంటి నిర్మాణం చేపడుతుండటంతో ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించి పూర్తి స్థాయిలో విచారించేంత వరకు నిర్మాణాలు చేపట్టరాదని హెచ్చరికలు జారీ చేశారు.

మహిళలపై దురుసు ప్రవర్తన

రెవెన్యూ అధికారుల ఆదేశాలను లెక్క చేయకుండా తిరిగి నిర్మాణ పనులు చేపడుతుండటంతో స్థానిక మహిళలు గురువారం నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఈ సమయంలో సదరు అధికార పార్టీ నాయకుడికి, మహిళలకు తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. స్థలం కోల్పోయిన అధికార పార్టీ నాయకుడు మహిళలను దుర్భాషలాడి దురుసుగా ప్రవర్తించినట్లు మహిళలు ఆరోపిస్తున్నారు. తమ మూడు వీధుల నుంచి శివాలయం రోడ్డుకు వెళ్లే లింకు రోడ్డు ఇది ఒక్కటేనని, దీనిని కూడా ఆక్రమిస్తే ఎలా అని ప్రశ్నించారు. కనీసం డ్రైనేజీ నిర్మాణం చేసుకునేందుకు కూడా వీలు లేకుండా పోతోందని వాపోయారు. ఇంతలో విషయం తెలుసుకున్న గోపవరం రెవెన్యూ సిబ్బంది, మున్సిపల్ పట్టణ ప్రణాళిక సిబ్బంది, పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని స్థలాన్ని పరిశీలించారు. పూర్తి స్థాయిలో రికార్డులు పరిశీలించేంత వరకు పనులు చేపట్టరాదని హెచ్చరించి వెళ్లారు. పనులు ఆగిపోవడంతో మహిళలు ఆందోళనను విరమించారు.


రస్తా ఆక్రమణను అడ్డుకుంటున్న స్థానిక ప్రజలు, మహిళలు

రస్తాను ఆక్రమిస్తే ఎలా..



శివాలయం రోడ్డు సమీపంలోని మూడు వీధుల నుంచి శివాలయం రోడ్డుకు వెళ్లేందుకు కొన్నేళ్లుగా ఇదే దారిని ఉపయోగించుకునేవాళ్లం. ప్రస్తుతం ఆ దారిని సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో కోర్టుకు వెళ్లి స్టే కూడా తీసుకువచ్చారు. అయినా రస్తాను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి. –అనసూయ, స్థానికురాలు

దౌర్జన్యం చేస్తున్నారు



రస్తాను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుంటే అడ్డుకోబోయిన మహిళలపై దౌర్జన్యం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలం అని తెలిసి కూడా విక్రయించడం దారుణం. మూడు వీధుల నుంచి శివాలయం రోడ్డుకు వెళ్లేందుకు ఇదొక్కటే దారి. మా ప్రభుత్వం లేనప్పుడే అడ్డుకోలేకపోయారు. ఇప్పుడు ఉండేది మా ప్రభుత్వం. ఎలా ఆపుతారో చూస్తామంటూ శ్రీధర్‌నాయుడు దౌర్జన్యం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి. – పద్మావతి, స్థానికురాలు

24 నుంచి అండర్-23 జోనల్ వన్డే క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్: కడప నగరం వేదికగా ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు ఏసీఏ అండర్-23 పురుషుల అంతర్ జోనల్ వన్డే క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం మైదానం, కేఓఆర్ఎం మైదానం వేదికలుగా ఈ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) కార్యదర్శి ఎ. రెడ్డిప్రసాద్ తెలిపారు.

తేదీ	తలపడే జట్లు	వేదిక
24-11-24	అనంతపురం '' రెస్ట్ ఆఫ్ సౌత్	వైఎస్ఆర్ఆర్
24-11-24	ప్రకాశం '' రెస్ట్ ఆఫ్ సెంట్రల్	కేఎస్ఆర్ఎం
24-11-24	తూర్పుగోదావరి ''రెస్ట్ ఆఫ్ నార్త్	కేఓఆర్ఎం
25-11-24	ప్రకాశం '' రెస్ట్ ఆఫ్ నార్త్	వైఎస్ఆర్ఆర్
25-11-24	అనంతపురం '' తూర్పుగోదావరి	కేఎస్ఆర్ఎం
25-11-24	రెస్ట్ ఆఫ్ సౌత్ '' రెస్ట్ ఆఫ్ సెంట్రల్	కేఓఆర్ఎం
27-11-24	తూర్పుగోదావరి '' రెస్ట్ ఆఫ్ సెంట్రల్	వైఎస్ఆర్ఆర్
27-11-24	ప్రకాశం '' రెస్ట్ ఆఫ్ సౌత్	కేఎస్ఆర్ఎం
27-11-24	అనంతపురం '' రెస్ట్ ఆఫ్ నార్త్	కేఓఆర్ఎం
28-11-24	అనంతపురం '' రెస్ట్ ఆఫ్ సెంట్రల్	వైఎస్ఆర్ఆర్
28-11-24	రెస్ట్ ఆఫ్ సౌత్ '' రెస్ట్ ఆఫ్ నార్త్	కేఎస్ఆర్ఎం
28-11-24	ప్రకాశం '' తూర్పుగోదావరి	కేఓఆర్ఎం
30-11-24	తూర్పుగోదావరి '' రెస్ట్ ఆఫ్ సౌత్	వైఎస్ఆర్ఆర్
30-11-24	అనంతపురం '' ప్రకాశం	కేఎస్ఆర్ఎం
30-11-24	రెస్ట్ ఆఫ్ సెంట్రల్ '' రెస్ట్ ఆఫ్ నార్త్	కేఓఆర్ఎం

కారు ఢీ కొని యువతి మృతి

నెల రోజుల క్రితమే భర్త మృతి, ఇప్పుడు కుమార్తె మరణం


ప్రమాదానికి కారణమైన కారు


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుమతి (ఇన్‌సెట్) సుమతి (ఫైల్)

చాపాడు: కడప - కర్నూలు జాతీయ ప్రధాన రహదారిలోని ద్వారకానగరం వద్ద గురువారం మధ్యాహ్నం కారు ఢీకొనడంతో దళితవాడకు చెందిన మారిగాండ్ల సుమతి(16) అనే యువతి మృతి చెందింది. మారిగాండ్ల సునీత గ్రామ సమీపంలోని కేసీ కాలువలో దుస్తులు ఉతుక్కునేందుకు వెళ్లింది. ఈ క్రమంలో ఇంటికి వచ్చేందుకు రోడ్డు దాటుతుండగా మైదుకూరు నుంచి ఆళ్లగడ్డ వైపు వెళ్తున్న టీఎస్07ఈఎం 9093 నెంబరు గల కారు అదుపుతప్పి యువతిని ఢీ కొని పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో యువతి పంట పొలాల్లో పడిపోయింది. ఈ సమయంలో ఆమెను కారు ఢీ కొట్టడం చుట్టు పక్కల ఎవరూ గమనించలేదు. కారు డ్రైవర్ గ్రామంలోకి వెళ్లి యువతి విషయం తెలపకుండా కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిందని గ్రామంలోని ఓ ట్రాక్టర్‌ను తెప్పించుకుని కారును బయటికి తీయించుకున్నాడు. గ్రామస్తులు కారు పంట పొలాల్లోకి ఏ విధంగా దూసుకెళ్లిందో అని పరిశీలన చేస్తుండగా సుమతి పంట పొలాల్లో గాయాలతో రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గమనించి వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. కారు ఢీ కొనగానే తెలిసి ఉంటే తన కుమార్తె ప్రాణాలతో బయట పడేదని యువతి తల్లి బుజ్జి కన్నీటి పర్యంతమైంది. నెల రోజుల క్రితమే భర్త వెంకటరమణ అనారోగ్యంతో మృతి చెందగా, ఇప్పుడు కూతురు ఇలా చనిపోవడంతో మృతురాలి తల్లితో పాటు గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన యువతి మైదుకూరు ప్రభుత్వ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి

కడప అర్బన్: కడప నగరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైనట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు కడప ఎర్రముక్కపల్లికి చెందిన డాక్టర్ రాహుల్ రెడ్డి ద్విచక్ర వాహనంలో బుధవారం రాత్రి వెళుతుండగా సీఎస్ఐ చర్చి సమీపంలో బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ..

కడప వన్ టౌన్ సర్కిల్ వద్ద బుధవారం రాత్రి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఆటో ఢీకొట్టడంతో మహమ్మద్ రఫీ (32) తీవ్రంగా గాయపడ్డాడు. రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడు మహమ్మద్ రఫీ మధ్యప్రదేశ్‌కు చెందిన వాడు. కొన్ని సంవత్సరాల క్రితం కడపకు వచ్చి వైవీ స్ట్రీట్‌లోని ఓ వస్త్ర దుకాణంలో పని చేసేవాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని మహిళ దుర్మరణం

చిట్వేలి: చిట్వేలి–రాపూరు ప్రధాన రహదారి, గట్టుమీదపల్లి క్రాస్ రోడ్డు సమీపంలోని పాలకేంద్రం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యాకసిరి పెంచలమ్మ (45) మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు గురువారం సాయంత్రం 6.30 గంటల సమయంలో పెనగలూరు మండలం, కట్టావారిపల్లికి చెందిన ఎల్లంపల్లి సుబ్రమణ్యం తన భార్య గంగాదేవి, ఎం.రాచపల్లికి ఎస్టీ కాలనీకి చెందిన పెంచలమ్మతో కలిసి టీవీఎస్ మోపెడ్‌లో రాజంపేట వైపు వెళ్తుండగా అదే సమయంలో రాపూరు వైపు వెళ్తున్న లారీ ఢీ కొంది. లారీ టైరు పెంచలమ్మ తలపై ఎక్కడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'వేరుశనగలో కదిరి లేపాక్షితో మంచి దిగుబడి'

కడప అగ్రికల్చర్: వేరుశనగ పంటకు సంబంధించి కదిరి లేపాక్షి(కె 1812) రకంతో రైతులు మంచి దిగుబడులను సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. గురువారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా సామూహిక ప్రథమ శ్రేణి క్షేత్ర ప్రదర్శన కింద జిల్లాలోని చింతకొమ్మదిన్నె మండలం ఇప్పపెంట గ్రామాన్ని, పెండ్లిమర్రి మండలం చెర్లోపల్లి, రామాపురం మండలం నల్లగుట్టపల్లె గ్రామ రైతులను ఎంపిక చేశారు. వీరు సామూహిక క్షేత్ర ప్రదర్శన కింద రబీలో కదిరి లేపాక్షి రకాన్ని సాగు చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటకు సంబంధించి కదిరి లేపాక్షి(కె 1812) ఆకు మచ్చ తెగులు తట్టుకుని పంట ఎత్తుగా పెరగకుండా ఎక్కువ కొమ్మలు పెరిగి ఎక్కువ ఊడలు వచ్చి కాయలు కూడా అధికంగా వస్తాయన్నారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు సాయి మహేశ్వరి, మానస, మహేష్‌బాబు, సురేష్‌కుమార్‌రెడ్డి, గిరీష్ కుమార్, రైతులు పాల్గొన్నారు.


రైతులకు పంపిణీ చేసిన కదిరి లేపాక్షి వేరుశనగ విత్తనాలతో శాస్త్రవేత్తలు, రైతులు